క్లుప్తంగా

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు సోమవారం వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాలు కొత్తపల్లి రజని, నగరానికి చెందిన పలువురు మహిళలు సారెను సమర్పించారు. వారికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో రైతులు సంతోషంగా ఉండాలని కోరుతూ అమ్మవారికి సారెను సమర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, వసుంధర, సునీత, అరుణ, ప్రతిమ, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



ఆటోనగర్(విజయవాడతూర్పు): సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ నేతలు పిలుపునిచ్చారు. ఈ నెల 9న జరగనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కార్మికవాడలోని కాటా సెంటరు నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ చేశారు. సీఐటీయూ అధ్యక్షుడు వీబీ రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయనున్న 4 లేబర్ కోడ్‌లు పూర్తిగా కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. జీఎస్టీ ఒత్తిళ్లకు తట్టుకోలేక పరిశ్రమలు దాదాపుగా మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పుప్పాల కృష్ణ, వి.గురుమూర్తి, డి.రవీంద్ర, టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్ఓ) 21001–2018 (ఈవోఎంఎస్) గుర్తింపు లభించినట్లు ఆ కాలేజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి హరగోపాల్ చేతుల మీదుగా గుర్తింపు పత్రాన్ని పొందినట్లు పేర్కొన్నారు. కళాశాలకు అంతర్జాతీయ ప్రమాణాల గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఐఎస్ఓ ప్రతినిధి హరగోపాల్ మాట్లాడుతూ అత్యాధునిక ప్రయోగశాలలు, సాంకేతిక విద్యాబోధన, ఉపాధి అవకాశాల కల్పన, పచ్చదనం, పరిశుభ్రత అంశాలను పరిశీలించి గుర్తింపు ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ గ్రిడ్‌ను సందర్శించిన ఈడీ

విజయవాడరూరల్: నున్నలోని పవర్ గ్రిడ్‌ను సదరన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్–1 (ఎస్ఆర్‌టీఎస్–1) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డోమన్ యాదవ్ సోమవారం సందర్శించారు. ఈడీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా విజయవాడ వచ్చిన ఆయన తొలుత ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం నున్నలో పవర్ గ్రిడ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) ఏసీ శంకరయ్య, సీజీఎం (అడ్మినిస్ట్రేటివ్) టీవీఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి అతిథి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పవర్ గ్రిడ్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్న తర్వాత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ జనరల్ మేనేజర్ కె.నాగమోహనరావు, డీజీఎం సమ్మయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పశుగ్రాస వారోత్సవాలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 9 నుంచి పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిడమానూరు పశు వైద్యాధికారి కె. సతీష్‌కుమార్ సోమవారం తెలిపారు. 9న నిడమానూరు పశు వైద్యశాల వద్ద, 10న ఎనికేపాడు రైతు సేవా కేంద్రం, 11న ప్రసాదంపాడు పశు వైద్యశాల, 14న రామవరప్పాడులో జరుగుతాయని తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బిక్కుబిక్కుమంటున్న కొండ ప్రాంతవాసులు



ఇటీవల 'పశ్చిమ'లో కొండ చరియలు జారిపడిన ప్రాంతం



ఇటీవల ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నేతలు

- ఇటీవల జారిపడుతున్న కొండచరియలు
- వర్షాలతో 'పశ్చిమ'లో భయాందోళన వ్యక్తం చేస్తున్న వైనం
- పటిష్టమైన చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వర్షాకాలం సీజన్ ప్రారంభం అయిందంటే చాలు పశ్చిమ నియోజకవర్గంలోని కొండ ప్రాంతవాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ఎక్కడ కొండచరియలు జారిపడతాయోనని భయాందోళనతో జీవిస్తున్నారు. ఏడాదిగా కూటమి ప్రభుత్వం కొండ ప్రాంత ప్రజల పరిరక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవటంతో కొండ చరియల భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో పలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్‌ను నూతనంగా నిర్మాణం చేసి ప్రజలకు భరోసా కల్పించారు. పెరుగుతున్న నివాసాలతో భూమిలోకి నీరు ఇంకుతుండటంతో కొండచరియలు ప్రమాదకరంగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఏటా వర్షాకాలంలో ఆందోళన....

ఏటా వర్షాకాలంలో కొండ ప్రాంత నివాసితులు ఆందోళనతోనే జీవనాన్ని కొనసాగిస్తుంటారు. మే మాసంలో కొత్తపేట 51వ డివిజన్ కొండ ప్రాంతంలో కొండచరియలు జారిపడి స్థానిక కుటుంబానికి తీవ్ర నష్టాన్ని కలగజేసింది. అలాగే ఇటీవల 46వ డివిజన్ రామరాజ్యనగర్‌లోని కొండ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో స్థానికంగా నివాసముండే బాబూరావు ఇంటిపై పడి నివాసం దెబ్బతిన్నది.

అలాగే దానికి సమీపంలో ఉన్న పలు వస్తువులు సైతం ధ్వంసమయ్యాయి. కొండ చరియలు జారి పడటం వలన ఆ ప్రాంతంలోని నివాసితులు తీవ్రంగా నష్టపోయారు. గొల్లపాలెంగట్టు ప్రాంతంలోని కొండ చరియలు ఇటీవల జారిపడి స్థానికంగా నివాసితులను తీవ్రంగా నష్టపరిచాయి. అదేవిధంగా కుమ్మరిపాలెం సెంటర్ సమీపంలోనూ ఇంటి వెనుక భాగంపై కొండ చరియలు జారిపడి స్థానికంగా నివాసముంటున్న మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈ విధమైన సంఘటనలు కొనసాగుతూనే ఉంటున్నాయి.

సగం డివిజన్లు కొండ ప్రాంతాల్లోనే....

పశ్చిమ నియోజకవర్గంలో సగానికి పైగా డివిజన్లు కొండ ప్రాంతల్లోనూ ఉంటాయి. లక్షకుపైగా ప్రజలు కొండ ప్రాంతాల్లోనూ నివాసం ఉంటున్నారు. వారంతా కొండ ప్రాంతాల పటిష్టతకు ప్రభుత్వం భద్రత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రధానంగా ఏడాది కాలంలో ఎక్కడా ఎటువంటి రిటైనింగ్ వాల్ నిర్మాణాలు చేపట్టలేదని స్థానికులు చెబుతున్నారు. కనీసం ప్రమాద భరితంగా ఉన్న ప్రాంతాల్లో కొండచరియలు జారిపడకుండా అవసరమైన చర్యలు చేపట్టడానికి అధికారులు స్పందించాలని పలువురు నివాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరంగా కొండచరియలు



పశ్చిమ నియోజకవర్గంలోని కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం చేపట్టాలి. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొండ చరియలు ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. భారీ వర్షం పడిన ప్రతిసారి ఎక్కడో ఒక చోట ప్రమాదం చోటు చేసుకుంటుంది. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి నివారణ చర్యలు చేపట్టాలి.

–గురుమహంతు మహేష్,
వైఎస్సార్ సీపీ 53వ డివిజన్ అధ్యక్షుడు

సావనీర్ డిజైన్ పోటీలో నిబంధనలు సడలించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సావనీర్ డిజైన్ పోటీలో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక ఉడ్ కార్వింగ్ కళలకు సంబంధించి విధించిన నిబంధనలు సరికాదని, వాటిని సడలించాలని వైఎస్సార్ సీపీ ఆర్టిజన్ (చేతి వృత్తిదారులు) విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (లేపాక్షి) ఇటీవల ప్రకటించిన సావనీర్ డిజైన్ రాష్ట్ర స్థాయి పోటీల బ్రోచర్ విడుదలలో నిబంధనలు పెట్టని లేపాక్షి.. ఇప్పుడు గైడ్‌లైన్స్ పేరుతో ఇతర కళలకు సైజులో విధించని నిబంధనలు హస్తకళాకారులకు పెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. సృజనాత్మక కళాకారుల ఆలోచనలకు విరుద్ధంగా కేవలం ఒక అడుగు సైజులోనే తయారు చేయాలని చెప్పటం వారి కళాత్మక హృదయానికి అడ్డుకట్ట వేయటమేనని తెలిపారు. కనీసం మూడు అడుగుల వరకు కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక ఉడ్ కార్వింగ్ బొమ్మలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎగువన వర్షాలు.. దిగువన దిగులు..!



లోకో షెడ్డు వద్ద డ్రెయిన్‌లో పేరుకున్న వ్యర్థాలు



కనుచూపు మేరలో పేరుకుపోయిన వ్యర్థాలు



బుడమేరులో నిలిచిపోయిన చెత్త

- వైఎస్సార్ కాలనీ వాసులను వెంటాడుతున్న ముంపు భయం
- బుడమేరులో పూడికలు తీయాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరు ముంపు అంటే చాలు జక్కంపూడి కాలనీ వాసులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. గతేడాది బుడమేరు ముంపుతో దాదాపు మూడు వారాల పాటు అష్టకష్టాలు పడ్డ కాలనీ వాసులు.. కనీసం తినడానికి తిండికి లేక చుట్టూ నీరు ఉన్నా తాగేందుకు గుక్కెడు నీళ్లు లేక అల్లాడిపోయిన దుస్థితి గుర్తుకు వస్తే చాలు భయంతో తల్లడిల్లిపోతున్నారు. రెండు రోజులుగా ఎగువన వర్షాలు కురుస్తున్నాయంటే మళ్లీ గత ఏడాది కష్టాలను గుర్తు చేసుకుంటున్నారు. అయితే కాలనీ మధ్య నుంచి ప్రవహిస్తున్న బుడమేరులో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. మళ్లీ అటువంటి వరద తమ కాలనీని ముంచెత్తుతుందేమోననే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బుడమేరు కాల్వలో పూడికలు తీసి ధైర్యం కల్పించాలని కాలనీ కోరుతున్నారు.

బుడమేరులో వ్యర్థాలు, గుర్రపు డెక్క

జక్కంపూడి కాలనీతో పాటు సీఎస్‌జీ బంకు సమీపంలో బుడమేరులో పెద్ద ఎత్తున పూడికలు, గుర్రపు డెక్క పేరుకుపోయాయి. గతేడాది వరద ముంపు అనంతరం బుడమేరులో పూడికలు తీసిన ప్రభుత్వ యంత్రాంగం ఆ తర్వాత ఇటు వైపు కన్నెత్తి చూడలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని ప్రభుత్వ పాఠశాల నుంచి ఫ్లైఓవర్ వరకు ఉన్న బుడమేరులో పెద్ద ఎత్తున చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. ఒకవేళ అకస్మాత్తుగా వరద నీరు బుడమేరులోకి వస్తే పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు.

రామరాజ్యనగర్ కట్ట వద్దే అదే పరిస్థితి..!

సితారా, కబేళా, ఊర్మిళానగర్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే డ్రెయిన్ నీరు ఫ్లైవోవర్ దిగువ నుంచి బుడమేరులో కలుస్తుంది. గతేడాది బుడమేరు ముంపు సమయంలో ఈ డ్రైన్‌లో చెత్త పేరుకుపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పడిన వర్షం నీరు డ్రెయిన్ల ద్వారా బుడమేరులోకి చేరాల్సింది పోయి వరద నీరు వెనక్కి నెట్టింది. దీంతో వైఎస్సార్ కాలనీలో మూడు వారాల పాటు ముంపునీరు ఉంటే రామరాజ్యనగర్ పరిసరాల్లో మూడు, నాలుగు రోజులు ఎక్కువగానే నీరు నిలవడం అందరికీ తెలిసిందే. తాజాగా ఫ్లైవోవర్ దిగువన రైల్వే ట్రాక్‌ల వద్ద పెద్ద ఎత్తున చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కొండ ప్రాంతంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కొండ ప్రాంత ప్రజలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం రామరాజ్యనగర్ కొండ బడి ఎదురు కొండ ప్రాంతంలో వారం రోజులుగా మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని సీపీఎం పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. కొండ ప్రాంతంలో మంచినీటిని సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖాళీ బిందెలతో మహిళలు నిరసన ప్రదర్శన చేశారు. సీపీఎం పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి బి.సత్యబాబు, సభ్యులు ఎండీ మస్తాన్, సీఐటీయూ నేత ఎస్.ప్రసాద్ మద్దతుగా నిలిచారు. వారు మాట్లాడుతూ కృష్ణానదికి కూతవేటు దూరంలో ఉన్నా ఈ ప్రాంత ప్రజలకు మంచినీరు కొరత రావడం బాధాకరమన్నారు.

సమస్యపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వందల మెట్లు దిగి మంచినీళ్లు తెచ్చుకుని మళ్లీ అన్ని మెట్లు ఎక్కాల్సి రావడం ప్రభుత్వ పని తీరుకు అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండ ప్రాంత మహిళల ఇబ్బందులను గమనించి ప్రత్యేక పంపింగ్ బూస్టర్‌ను ఏర్పాటు చేసి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం వద్దకు వచ్చిన వాటర్ సప్లై ఏఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ధ్యానచంద్రకు వినతి పత్రం అందజేశారు. దుర్గాకుమారి, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ ఏపీ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్

భవానీపురం (విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా గుడివాడ నియోజకవర్గం చిగురుకోటకు చెందిన కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ముదిరాజ్ మహాసభ జాతీయ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. సోమవారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎంపిక జరిగినట్లు ప్రస్తుత అధ్యక్షుడు, ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొర్న నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ మాట్లాడుతూ ముదిరాజ్‌ల అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా బొమ్మన సుబ్బారాయుడు ముదిరాజ్, గుడాల సత్యనారాయణ ముదిరాజ్ ఎన్నికయ్యారు.

ముగిసిన స్థాయీసంఘం సభ్యుల నామినేషన్లు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ అభివృద్ధికి ఏర్పాటయ్యే స్థాయిసంఘం సభ్యుల ఎన్నికకు కార్పొరేటర్ల నుంచి నామినేషన్‌ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. ఆరుగురు సభ్యులుండే సంఘానికి వైఎస్సార్ సీపీ నుంచి 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రహమతున్నీసా, 19వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ రెహానా నాహిద్, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, 1వ డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి.. వీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్‌కు నామినేషన్లు సమర్పించారు. అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ అనంతరం జరిగే స్క్రూటినీ మంగళవారం జరగనుంది. స్థాయిసంఘం సభ్యులుగా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో ఏకగ్రీవయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గురుపౌర్ణమి వేడుకలను ఈ నెల 10వ తేదీ గురువారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పసుపుతోట శ్రీదత్తసాయి మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు తంగెళ్లమూడి వీరమోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 5.30 గంటలకు కాకడ హారతితో గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని శ్రీకల్యాణ సాయి బాబా మందిరంలోనూ గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు మధుసూధనరావు పేర్కొన్నారు. బాబా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు.

వైభవంగా పాండురంగడికి తులసి దళార్చన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ కన్యకాపరమేశ్వరి దేవస్థానం (కొత్త గుళ్ళు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామికి సోమవారం లక్ష తులసి దళార్చనను వైభవంగా నిర్వహించారు. పాండురంగస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం విష్ణు సహస్రనామ సహిత లక్ష తులసీదళార్చనను భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వహించారు. రాత్రి స్వామి వారి పవళింపు సేవ శాస్త్రోక్తంగా జరిగింది. వైదిక కార్యక్రమాలను అర్చకులు పులిపాక రాఘవాచార్యులు ఆంజనేయాచార్యులు, అడ్డేపల్లి మురళీకృష్ణచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రముఖులు పర్యవేక్షించారు.

ప్రజా క్షేమమే ప్రధానం

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పంజాసెంటర్‌లో డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని కొండ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను వెంటనే అక్కడి నుంచి తరలించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం పంజా సెంటర్, చిట్టినగర్, కబేళా, లేబర్ కాలనీ, వర్క్ షాప్ రోడ్, కుమ్మరిపాలెం సెంటర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న ఇళ్లలో నివసిస్తున్న ప్రజలకు అవగాహన కల్పించి వారికి సురక్షమైన ఇళ్లను కేటాయించాలన్నారు. కబేళాలో జేఎన్ఎన్యూఆర్ఎం ఇళ్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్‌లో భాగంగా చిట్టినగర్‌లో ఉన్న నైట్ షెల్టర్ హోమ్స్‌కు వచ్చే నిరాశ్రయులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ అధికారులను ఆదేశించారు. పంజా సెంటర్ కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. లేబర్ కాలనీలో జరుగుతున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



పీజీఆర్ఎస్‌లో కమిషనర్ ధ్యానచంద్రకు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

పటమట(విజయవాడతూర్పు): అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదులు– పరిష్కార కార్యక్రమంలో ఆయన నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రధాన కార్యాలయంలో నిర్వహించడమే కాకుండా జోనల్ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. ఆయన గతవారం ఫిర్యాదు చేసిన దరఖాస్తుల్లో పునరావృతమైన వాటిని సమీక్షించారు. ఇవి తిరిగి రాకుండా ప్రజల ఫిర్యాదులను ఎలా పరిగణించాలి, ఎలా పరిశీలించాలి, ఎలా పరిష్కరించాలి వంటి అంశాలపై అధికారులకు సూచించారు. పురమిత్ర యాప్‌లో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి వాటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు వంటి అంశాలను చర్చించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యను అర్థం చేసుకొని శాశ్వతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 22 ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 10, ఇంజినీరింగ్ 8, వైద్య – ఆరోగ్యం 1, హార్టికల్చర్ 3 మొత్తం కలిపి 22 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్). డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జున్ రావు, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీపై సీపీఎం ఫిర్యాదు

నగరంలో వృద్ధులు, వితంతు వికలాంగులు, ఒంటరి మహిళల పెన్షన్లు పదివేలె పెండింగ్‌లో ఉంటే కేవలం 675లో మాత్రమే.. చనిపోయిన వారి స్థానంలో మంజూరు చేశారని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు సోమవారం పీజీఆర్ఎస్‌లో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రకు ఫిర్యాదు చేశారు.

దాతల సాయంతో లక్ష్యాన్ని చేరుకోవాలి



నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో దాత సురేష్ బాబు, కార్పొరేటర్ రత్నకుమారి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దాతల సాయంతో విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలని కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి ఆకాంక్షించారు. 'పది' పరీక్షల్లో 500 మార్కులు సాధించిన విద్యార్థులకు విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో పీఈటీగా పని చేసి రిటైరైన గద్దె సురేష్‌బాబు, ఆయన పెద్ద కుమారుడు రవితేజ, కోడలు ప్రణవి (ఎన్ఆర్ఐ) సౌజన్యంతో రూ.1,01,000 నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. మొత్తం 16 మందికి రూ.10, 8, 7, 6, 5 వేలు చొప్పున అందజేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులు నగదు పురస్కారాలను అందుకున్న పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని అంతకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని సూచించారు.

విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు గద్దె సురేష్ బాబు మాట్లాడుతూ పాఠశాలలో ఇంత మంచి ఫలితాలను సాధించడం సంతోషంగా ఉందన్నారు. అందుకే తమ కుటుంబసభ్యులందరం కలిసి నగదు పారితోషికం అందించామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ వెంకట్రావు, పూర్వ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కె.రంగారావు, జమీల భాను, లక్ష్మీ నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



కలరా హాస్పటల్ వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వీఎంసీ పరిధిలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. యూనియన్ ఆధ్వర్యాన సోమవారం చిట్టినగర్ ప్రాంతంలోని సర్కిల్–1 కార్యాలయం (కలరా హాస్పటల్) వద్ద యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా నాయకత్వంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఉన్నా పార్కుల కార్మికులకు ఒక జీతం, ఇంజినీరింగ్ కార్మికులకు ఒక రకం జీతం, పారిశుద్ధ్య కార్మికులకు మరొక రకమైన జీతం చెల్లించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఒక్కొక్కరికి ఒక రకమైన జీతం ఇవ్వడం కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమేనన్నారు. వారి ఉత్తర్వుల ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో జీవిస్తున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందకపోవడం దారుణమని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

నాలుగు లేబర్ కోడ్‌ల రద్దును వ్యతిరేకిస్తూ ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ హెలెన్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళా సమాఖ్య నాయకురాలు దుర్గాసి రమణమ్మ, యూనియన్ గౌరవాధ్యక్షుడు జక్కి జేమ్స్, సహాయ కార్యదర్శి తుపాకులు ప్రతాప్, కోశాధికారి తుపాకులు నాగేశ్వరరావు, నాయకులు బి.దుర్గాప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.